క్లుప్తంగా

ఘనంగా వారాహి నవరాత్రులు ప్రారంభం



పూజలందుకుంటున్న నవదుర్గ అమ్మవారు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ, జ్ఞానసరస్వతి అమ్మవార్ల ఆలయంలో వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు రామాయణం శ్రీనివాసరావుశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థి లక్ష్మణరావు, తల్లిదండ్రులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రాజాం సిటీ: పొగిరి ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుకుని నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులు లావేటి లక్ష్మణరావు, జి.కుమార్‌రాజు, జె.ద్రాక్షాయణి, ఎల్.హిమబిందు, వి.జగదీష్, వారి తల్లిదండ్రులను ను ఉపాధ్యాయులు గురువారం సన్మానించారు. అతిథిగా హాజరైన ఎంఈఓ వై.దుర్గారావు మాట్లాడుతూ ఈ విద్యార్థులను పాఠశాలలోని మిగతా విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.ఉపాధ్యాయులు దాలినాయుడు, సత్యారావు, మజ్జి మధన్, తదితరులు పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్సలకు 50మంది ఎంపిక



శిబిరంలో నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ నిక్సన్

తెర్లాం: స్థానిక వాసవి కల్యాణ మండపంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. తెర్లాంతో పాటు చుట్టు పక్క గ్రామాల నుంచి వచ్చిన సుమారు వంద మందికి ఆప్తాలమిక్ నిక్సన్ కంటి పరీక్షలు చేశారు. వీరిలో 50 మందిని కంటి ఆపరేషన్‌లకు ఎంపిక చేశామని, వీరందరికీ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని శిబిరం సమన్వయకర్త సాయి కుమార్ తెలిపారు. శిబిరాన్ని పెరుమాళి పీహెచ్‌సీ ఆప్తాలమిక్ అధికారి వసంతరావు పర్యవేక్షించారు.శిబిరానికి వచ్చిన వారికి ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక ఆర్యవైశ్య సంఘ నాయకులు కందుల శ్రీనివాసరావు, వరదా నాగేశ్వరరావు ఏర్పాట్లు చేశారు.

అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం, సిబ్బంది

బొబ్బిలి: ఏపీ పీజీ సెట్‌లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని పట్టణంలోని ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయనతో పాటు కళాశాల వ్యవస్థాపకులు రౌతురామమూర్తి నాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ బొంతు శ్రీరాములు గురువారం అభినందించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ విద్యార్థిని యాండ్రాపు లిఖితకు కెమిస్ట్రీలో 96వ ర్యాంకు, యడ్ల బిజిలికి ఇంగ్లిష్‌లో 245వ ర్యాంకు, కంప్యూటర్ సైన్స్‌లో చప్ప లిఖితకు 337వ ర్యాంకు, సత్యవరపు కీర్తికి 885, కొట్యాడ హిమబిందుకు 1108, అలమండ పావనికి 998 ర్యాంకులు వచ్చాయని చెప్పారు.

ఉపకరణాల పంపిణీ



ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఉపకరణాలు అందజేస్తున్న ఎంఈఓలు ప్రవీణ్‌కుమార్, దుర్గారావు

రాజాం: మండలంలోని పలుగ్రామాలకు చెందిన ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఏపీ సమగ్రశిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక భవితా కేంద్రం వద్ద ఎంఈఓలు ప్రవీణ్‌కుమార్, యాగాటి దుర్గారావు గురువారం ఉచితంగా సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ గతంలో భవిత కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నవారిలో 32 మందికి వీల్‌చైర్స్, ట్రైసైకిళ్లు, సీపీ చైర్స్, తదితర ఉపకరణాలు అందించామని చెప్పారు. రిసోర్స్ పర్సన్‌లు ఎస్.హరిబాబు, వి.శ్రీనివాసరావు, శాంతికుమారి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత అవస్థలు

- ఖరీఫ్ ప్రారంభంలోనే రైతులకు ప్రారంభమైన కష్టాలు
- పూర్తిస్థాయిలో అందని వరి విత్తనాలు
- రైతు సేవా కేంద్రాల్లో లభ్యం కాని ఎరువులు
- రామభద్రపురం మండలంలో వరి విత్తనాల పంపిణీ లక్ష్యం 1,399 క్వింటాళ్లు
- ప్రభుత్వం సరఫరా చేసింది 991 క్వింటాళ్లు
- విత్తనాల కోసం ప్రైవేటు దుకాణాలను ఆశ్రయిస్తున్న రైతులు



కొట్టక్కిలో పొలం దున్నుతున్న రైతు

రామభద్రపురం: మండల రైతులు విత్తనాలు,ఎరువుల కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అన్నదాతలకు రాయితీపై అందించాల్సిన వరి విత్తనాల్లో కూటమి సర్కారు కోత వేసింది. ప్రతిపాదిత విత్తన ప్రణాళికను పక్కన పెట్టి తగ్గించి నామమాత్రపు కేటాయింపులు చేస్తూ విత్తనాలు సరఫరా చేసింది. దీంతో అన్నదాతలు విత్తనాల కోసం నానా పాట్లు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఓ వైపు పెట్టుబడి సాయం అందించకుండా జాప్యం చేస్తున్న ప్రభుత్వం విత్తనాలు,ఎరువులు కూడా సక్రమంగా అందివ్వకపోవడంపై రైతుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. మండలానికి 1,399 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమవుతాయని వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదన లు పంపించగా..991 క్వింటాళ్ల విత్తనాలను మాత్రమే ప్రభుత్వం సరఫరా చేసింది. ఇందులో 1121 రకం 1070 క్వింటా ళ్లు, బీపీటీ(సాంబమసూరి) 5204 రకం 100 క్వింటాళ్లు, 1064 రకం 5 క్వింటాళ్లు, సోనా మసూరి రకం 167.5 క్వింటాళ్లు, 1224 కొత్తరకం సన్నాలు 5 క్వింటాళ్లు, ఆర్‌జీఎల్ రకం 51.6 క్వింటాళ్లను ప్రభుత్వం సరఫరా చేసింది. ఈవిత్తనాలు చాలకపోవడంతో రైతులు తమ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. విత్తనాలు లేవు, అయిపోయాయి, మళ్లీ తెప్పిస్తాం అని చెబుతూ వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది కాలయాపన చేస్తున్నారు. కొంతమంది రైతులు విసిగిపోయి, చేసేది లేక ప్రైవేటు దుకాణాల ను ఆశ్రయిస్తున్నారు.ఒక్కో 30 కిలో బ్యాగుకు అదనంగా రూ.330 వరకు చెల్లించి నష్టపోతున్నారు. ఉదాహరణకు 1121 రకం వరి విత్తనాల 30 కిలోల బ్యాగు రైతుసేవా కేంద్రంలో రాయితీ పోగా రూ.960కు లభించగా.. అదే బ్యాగు ప్రైవేటు దుకాణాల్లో రూ.1290కు విక్రయిస్తున్నారు.

ఎరువుల కోసం ఎదురుచూపులు

మండల రైతులు ఎరువుల కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. మండలంలో మొక్కజొన్న,పత్తి



విత్తనాలు,ఎరువులు నిల్వలు లేని రామభద్రపురం రైతు సేవా కేంద్రం

పంటలతో పాటు కూరగాయల పంటలను అధికంగా సాగు చేస్తున్నారు. అడపాదడపా వర్షాలు కురుస్తుం డడంతో పంటలకు ఎరువులు వేసేందుకు రైతులు ముందుకొస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు దొరక్క ప్రైవేటు దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. మండలంలో 204 మెట్రిక్ టన్నుల యూరియా, 204 మెట్రిక్ టన్నుల డీఏపీ అవసరమని వ్యవసాయాధికారులు ప్రతిపాదనలు పంపించారు. అయితే దుప్పలపూడి రైతు సేవా కేంద్రానికి 12 టన్నుల యూరియా సరఫరా చేశారు. ఈ



గ్రోమోర్ దుకాణంలో వరి విత్తనాలు కొనుగోలు చేసి పట్టుకెళుతున్న మిర్తివలస రైతులు

యూరియా ఎటుకూ చాల దన్న ఉద్దేశంతో పూర్తిస్థాయిలో ఎరువులు వచ్చేవరకు ఎవరికీ పంపిణీ చేయకుండా అలా వదిలేశారు. గొల్లపేట,తారాపురం, జనన్నివలస,ఆరికతోట, దుప్పలపూడి,పాతరేగ రైతు సేవా కేంద్రాలకు మాత్రమే కొద్ది మొత్తంలో అయినా డీఏపీ పంపించారు.

రైతులు అష్టకష్టాలు పడుతున్నారు..



కూటమి పాలనలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.అధికారంలోకి వచ్చి ఏడాదైనా ప్రభుత్వం నుంచి రైతులకు ఎలాంటి సాయమూ అందలేదు.రైతు సంక్షేమాన్ని గాలికొదిలేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు రాయితీపై సరిపడా విత్తనాలు,ఎరువులు కూడా సరఫరాచేయకపోవడం దారుణం.రైతులు ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోతున్నారు.

– ఎస్.సత్యంనాయుడు, బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ రైతు సంఘం అధ్యక్షుడు

ఆందోళన వద్దు..



ప్రస్తుతానికి వచ్చిన విత్తనాలు అయిపోయాయి.మండలంలోని కొన్ని రైతు సేవా కేంద్రాల్లో కొద్దిపాటి నిల్వలు ఉన్నాయి. రైతులను ఆయా కేంద్రాలకు వెళ్లి తెచ్చుకోవాలని చెబుతున్నాం. విత్తనాల కోసం రైతులు అందోళన చెందాల్సిన పనిలేదు.సీజన్ ముందుకెళ్లలేదు.రైతులు అవసరమని వస్తే తెప్పిస్తాం.అలాగే ఎరువుల కోసం కూడా ప్రతిపాదనలు పంపించాం. యూరియా దుప్పలపూడి రైతు సేవా కేంద్రానికి మాత్రమే 12 మెట్రిక్ టన్నులువచ్చింది. గొల్లపేట,తారాపురం, జనన్నివలస,ఆరికతోట, దుప్పలపూడి,పాతరేగ రైతు సేవా కేంద్రాల్లో డీఏపీ అందుబాటులో ఉంది. ఇంకా రైతులకు పంపిణీ ప్రారంభించలేదు. ప్రైవేటు ఎరువుల దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.

– వెంకటయ్య,ఏఓ,రామభద్రపురం

కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

బొబ్బిలి: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కార్మికుల సంఘం నాయకులు మజ్జి ఈశ్వరరావు, తెంటు రవిబాబు తదితరులు ఎమ్మెల్యే బేబీ నాయనను కోరారు.స్థానిక కోటలో ఎమ్మెల్యేను మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని, అలాగే 15 ఏళ్ల సర్వీసు ఉన్న కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళతానని చెప్పారు.

పాఠశాల సందర్శన



రికార్డులను పరిశీలిస్తున్న డీఈఓ మాణిక్యంనాయుడు

బొబ్బిలి: పట్టణంలోని వేణుగోపాల మున్సిపల్ ఉన్నత పాఠశాలను డీఈఓ యు.మాణిక్యం నాయుడు గురువారం సంద ర్శించారు. పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు.జూలై 5న మెగాపేరెంట్స్ డే నిర్వహణపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈఓ చల్ల లక్ష్మణరావు ఉన్నారు.

డ్రాపౌట్స్ లేకుండా చూడాలి

బొబ్బిలిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా, డ్రాపౌట్స్ లేకుండా చూడాల్సిన బా ధ్యత ఉపాధ్యాయు లదేనని డీఈఓ యు.మాణిక్యంనా యుడు అన్నారు.స్థానిక భవిత కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని పలు పాఠశాలల్లో అదనపు భవనాల నిర్మాణానికి రూ.37 కోట్లు మంజూరయ్యా యని చెప్పారు. పాఠశాల ల్లోని ఆర్‌ఓ ప్లాంట్ల మరమ్మతుల అంశాన్ని సంబంధిత ఏజెన్సీతో చర్చిస్తామన్నారు.జూలై 5న నిర్వహించే మెగా పేరెంట్స్ మీటింగ్‌కు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు.

గిరిజనుల గోడు పట్టదా..?

మెంటాడ: తమ గ్రామాన్ని ఆనుకుని ఉన్న కోళ్ల ఫారం వల్ల రోగాల పాలవుతున్నామని, కోళ్ల ఫారాన్ని అక్కడి నుంచి తరలించాలని మూడు వారాలుగా బిరసాడవలస గ్రామ గిరిజనులు నిరసనలు, దీక్షలు చేస్తుంటే పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని సీపీఎం కార్యదర్శి రాకోటి రాములు అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాలుగో రోజు గురువారం బిరసాడవలస గ్రామస్తులు నిరసన కొనసాగించారు. వీరికి రాకోటి రాములు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కోళ్ల ఫారాన్ని తొలగించాలని గిరిజనులు, వివిధ పార్టీల నాయకులు చేస్తున్న దీక్షలు, నిరసనలు జిల్లాకు చెందిన గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎంఎస్‌ఎంఈ , సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గిరిజనులకు మద్దతు తెలుపుతున్న నాయకులపై



మీడియాతో మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి రాములు

తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు రెడ్డి రాజప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని కోరారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సబ్బవరపు రాజశేఖర్ మాట్లాడుతూ కోళ్లఫారం యాజమాన్యానికి అండగా నిలబడి, గిరిజనుల పోరాటానికి మద్దతిస్తున్న నాయకులపై ఓ పత్రికా విలేకరి (సాక్షి కాదు) తప్పుడు వార్తలు రాస్తున్నారని, ఆయన ఆ ఫారం పరిసరాల్లో ఉంటే పరిస్థితి అర్థమవుతుందన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు ఛిన్నాభిన్నం



బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు



సంతకవిటి: మండల కేంద్రంలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, అధికారులు

మత్తుపదార్థాలకు బానిసగా మారితే బతుకులు ఛిన్నాభిన్నమవుతాయని, విద్యార్థులు, యువత వాటి జోలికి పోవద్దని ఎక్సైజ్, పోలీస్, వివిధ శాఖల అధికారులు, అధ్యాప కులు,ఉపాధ్యాయులు సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎక్సైజ్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో బొబ్బిలి, రాజాం నియోజకవ ర్గాల్లోని మండల కేంద్రాల్లో, పలు గ్రామాల్లో, విద్యాలయాల్లో గురువారం అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిసగా మారి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించా రు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



రాజాం: ఐటీఐ కళాశాలలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు



రేగిడి: ఉంగరాడమెట్ట వద్ద విద్యార్థుల మానవహారం



రాజాం సిటీ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ



రామభద్రపురం: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, వివిధ శాఖల సిబ్బంది



తెర్లాం: ర్యాలీచేస్తున్న విద్యార్థులు, అధికారులు



వంగర: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు



మెంటాడ: మండల కేంద్రంలో ర్యాలీ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



బాడంగి: పోలీస్ స్టేషన్‌వద్ద అవగాహ కల్పిస్తున్న పోలీస్ సిబ్బంది

పట్టించుకునే వారేరి..?



ఈచిత్రంలో కనిపిస్తున్నది రేగిడి మండలంలోని సాయన్న చానెల్ పరిధిలో సంకిలి వద్ద ఉన్న పెద్దపూను. సాయన్న చానెల్ నుంచి వచ్చే నీటిని ఇక్కడ నిల్వచేసి ఎగువున ఉన్న పిల్ల కాలువల ద్వారా సుమారు వెయ్యి ఎకరాలకు ఖరీఫ్‌లో సాగునీరంది స్తుంటారు. అయితే ఈ పెద్ద పూను తూములు శిథిలావస్థకు చేరుకోగా...ఉన్న మూడు షట్లర్లు తుప్పు పట్టి ఊడిపడిపోయే దశలో ఉన్నాయి. మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. షట్లర్లకు మరమ్మతులు చేస్తేనే ఖరీఫ్ వరి పంటకు సక్రమంగా సాగునీరందుతుందని రైతు లు చెబుతున్నారు. అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

– రేగిడి

అస్తవ్యస్తంగా సాగునీటి కాలువ



ఈ చిత్రంలో కనిపిస్తున్నది బొబ్బిలి మండలంలోని పిరిడి గ్రామంలో 400 ఎకరాలకు సాగునీరందించే కాలువ. గ్రామ సమీ పంలోని పోలవానివలస చెరువు నుంచి ఈ కాలువ ద్వారానే పొలాలకు సాగునీరు అందుతుంటుంది. అయితే కాలువ నిర్వహ ణను అధికారులు పట్టించుకోకపోవడంతో అస్తవ్యస్తంగా తయారైంది. పూడిక పేరుకుపోవడంతో పాటు పిచ్చిమొక్కలు గడ్డి, తుప్పలు ఏపుగా పెరిగాయి. పూడిక, తుప్పలు తొలగించకుంటే పొలాలకు సక్రమంగా సాగునీరందదని ఆ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఉపాధి హామీ పనుల్లో భాగంగా అయినా కాలువను బాగు చేయించాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

– బొబ్బిలిరూరల్

చిత్తడి..చిత్తడిగా



బాడంగి మండలంలోని పలు గ్రామాల గ్రావెల్, మట్టి రోడ్లు తాజాగా కురిసిన వర్షాలకు చిత్తడి చిత్తడిగా మారాయి. ముగడ తారురోడ్డు నుంచి తెంటువాని చెరువుగట్టు మీదుగా చినభీమవరం వెళ్లే గ్రావెల్ రోడ్డు అధ్వానంగా తయారైంది.అలాగే అల్లు పాల్తేరు, బొత్సవానివలస మీదుగా ఆనవరం వెళ్లే రోడ్డు, రామచంద్రాపురం నుంచి రావువలస, విమానాశ్రయం మీదు గా మల్లంపేట వెళ్లే రోడ్డులో బురదమయమయ్యాయి. ఈ రోడ్లలో ఎక్కడికక్కడ గోతులు తేలాయి. వాటిలో వర్షపు నీరు నిలిచిపోవడంతో చెరువుల్లా దర్శనమిస్తున్నాయి. ద్విచక్రవాహన చోదకులు అదుపుతప్పి పడిపోతున్నారు. అధికారులు స్పందించి బీటీరోడ్లు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పక్కా రోడ్డుసౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

– బాడంగి

ఆర్థిక సంఘం నిధుల విడుదలలో నిర్లక్ష్యం

వంగర: గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎంపీపీ ఉత్తరా వెల్లి సురేష్‌ముఖర్జీ మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం కొన్ని నెలల క్రితమే విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని స్థానిక సంస్థలకు కేటాయించడంలో తాత్సారం చేస్తోందన్నారు. గ్రామాల్లోని గ్రీన్ అంబాసి డర్లకు వేతనాలు సకాలంలో చెల్లించలేకపోతున్నామని, పారిశుద్ధ్య పనుల నిర్వహణ, తాగునీటి వనరుల క్లోరినేషన్, బ్లీచింగ్‌కు కూడా నిధులు లేవని అన్నారు. వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అత్యవసర సమయంలో ఖర్చు చేయాల్సిన నిధులు గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లకు లేకపోవడంతో సర్పం చ్‌లు ప్రజలకు సమాదానం చెప్పలేకపోతున్నారన్నారు. రాష్ట్రప్రభుత్వం స్పందించి 15వ ఆర్థిక సంఘం నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ

వాటర్‌ట్యాంకుల నిర్మాణానికి ప్రతిపాదనలు

బొబ్బిలిరూరల్: జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా నియోజకవర్గంలో వాటర్ ట్యాంకులు,పైపులైన్ల నిర్మాణానికి రూ.61 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఢిల్లీశ్వ రరావు తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బొబ్బిలి మండలంలో 12 ట్యాంకులు,77 కిలోమీటర్ల మేర పైపు లైన్లు,7,800 ట్యాపుల ఏర్పాటుకు రూ.12.60 కోట్లు అవసరమని అంచనా వేశామన్నారు. అలాగే రామభద్రపురం మండలంలో 32 ట్యాంకులు,88 కిలోమీటర్ల మేర పైపు లైన్లు, 7,300 ట్యాపులకు రూ.17.20 కోట్లు, బాడంగి మండలంలో 13 ట్యాంకులు, 83 కిలోమీటర్ల మేర పైపులైన్లు, 3,900 ట్యాపులకు రూ.13.80కోట్లు, తెర్లాం మండలంలో 11 ట్యాంకులు,147 కిలోమీటర్ల మేర పైపులైన్లు, 6,127 ట్యాపులకు రూ.17.90 కోట్లతో అంచనాలు వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని స్పష్టం చేశారు.అలాగే రూ.500 కోట్లతో తోటపల్లి వాటర్ ప్రాజెక్టులో గ్రిడ్ నిర్మాణం కోసం ప్రతిపాదించామని తెలిపారు.

ఆ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

బొబ్బిలి: పెన్షన్ నిబంధనలను సవరించి పాత పెన్షనర్లకు నష్టం కలిగించే చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు రౌతు రామమూర్తినాయుడు కోరారు. రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులతో కలిసి జిల్లా కేంద్రంలో కలెక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రామమూర్తినాయుడు మాట్లాడుతూ కేంద్రం తీసుకువచ్చిన ఈచట్టం వల్ల పెన్ష నర్లను రెండు గ్రూపులుగా విభజించే ప్రమాదముందన్నారు. దీని వల్ల వేతన సవరణ సంఘం సిఫార్సులను కొత్త పెన్షనర్లకు మాత్రమే వర్తింపజేసి పాత పెన్షనర్లను పక్కన పెట్టే పరిస్థితులున్నాయన్నారు. పెన్షనర్లపై వివిధ అంశాల మీద నిర్ణయాధికారాన్ని కేంద్రం తన చేతుల్లోకి తీసుకునే చర్యలు ఇవని అన్నారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎల్.జగన్నాథం, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి కృష్ణమూర్తినాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు పోల సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు